ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 12 | జూలై | 2024 పేజీలు 8




# కౌలు రైతు గుర్తింపు ఎలా..?



**-ఆదుకునే మార్గమేది**
**-సంక్లిష్ట స్థితిలో కౌలు రైతు**
**-రైతు భరోసాలో వాటాకు పట్టాదారుల విముఖత**

**ప్రజాపక్షం/ ఖమ్మం:** రైతు భరోసా పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్న నేపథ్యంలో కౌలు రైతుల అంశంగా విస్తృతంగా చర్చలోకి వస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 30 శాతం మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా ఉండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు కొన్ని జిల్లాల్లో 40 శాతానికి పైబడి కౌలు రైతులు ఉన్నట్లు సమాచారం. భూ యజమానికి ప్రభుత్వం రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం అందించనున్న నేపథ్యంలో వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతు పరిస్థితి ఏమిటి, ప్రభుత్వం ఏవిధంగా ఆదుకోవాలన్న విషయంలో అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి అన్న దానిపై స్పష్టమైన అభిప్రాయం రావడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ పేరిట సమావేశాలు నిర్వహిస్తుంది. భూ యజమానులకు ఇచ్చే రైతు భరోసా ఎంత భూమికి పరిమితం చేయాలి, ఏ భూములకు రైతు భరోసా వర్తింపజేయాలి అన్న దానిపై చర్చ అవసరమే కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ నిబంధనలలో కౌలు రైతును ఆర్థికంగా కానీ, మరోవిధంగా కానీ సాయం అందించే మార్గం కనిపించడం లేదు. భూ యజమానికి కౌలు రైతుకు మధ్య ఒప్పందంలో రైతు భరోసా అంశం కూడా చర్చకు వచ్చి దానిపై ఆధారపడి కౌలును నిర్ణయించుకుంటున్నారు. ఇటువంటి సమయంలో రైతు భరోసాలో కౌలు రైతుకు వాటా కానీ మరో విధంగా కానీ లాభం చేకూరే మార్గం లేదు. ఇక కౌలు రైతుకు, భూ యజమానికి మధ్య జరిగిన ఒప్పందాన్ని వ్రాత పూర్వకంగా ప్రభుత్వానికి ధృవీకరించేందుకు భూ యజమాని అంగీకరించే పరిస్థితి లేదు. ఒకే సంవత్సరం రెండు పంటలకు వేర్వేరు రైతులకు కౌలుకు ఇస్తున్న సమయంలో ధృవీకరణ అంశం అప్రస్తుతమవుతుంది.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2లో..















# కౌలు రైతు గుర్తింపు ఎలా..?

(మొదటిపేజీ తరువాయి)
కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేసింది. ఇప్పుడు కూడా కౌలు రైతులను గ్రామాల వారీగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించి వ్యవసాయ అధికారుల ధృవీకరణతో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో ప్రభుత్వ పరంగా సబ్సిడీ ఇవ్వవచ్చు. అన్నింటికి మించి కౌలు రైతు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే సమయంలో బోనస్ ఇవ్వవచ్చు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంటలు సాగు చేసిన కౌలు రైతును గుర్తించి నేరుగా కౌలు రైతుకే ఆర్థిక సాయం అందించవచ్చు. వాస్తవ సాగుదారైన కౌలు రైతుకు ప్రస్తుత బ్యాంక్ నిబంధనల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే అవకాశం లేదు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో కౌలు రైతులకు రుణాల అంశం చర్చకు వచ్చినా పట్టాదారు పాసుపుస్తకాలు లేకుండా బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. లక్షలాది రూపాయల విలువైన భూములను తనాఖా పెట్టుకుని రూ. 50వేలు రుణాలు ఇచ్చే బ్యాంకులు అసలు ఆధారం లేకుండా రుణాలు ఇవ్వడం సాధ్యం కాదు. కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా జామీను ఉంటే తప్ప రుణ సౌకర్యం కలిగే అవకాశం లేదు. వ్యవసాయ యంత్రాలకు సంబంధించి ప్రభుత్వం గుర్తింపు పొందిన కౌలు రైతులకు నేరుగా సబ్సిడీ అందించి తక్కువ ధరకు యంత్రాల విడి భాగాలు , ట్రాక్టర్లు లేదా ఇతర యంత్రాలను అందించవచ్చు. ప్రభుత్వం కౌలు రైతు చట్టాలను రూపొందించి అమలు చేస్తే తప్ప 30 నుంచి 40 శాతం ఉన్న కౌలు రైతులకు లబ్ధి చేకూరే పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న పరిస్థితుల్లో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

# పోలీస్ తీరుపై జర్నలిస్టుల నిరసన

**-దాడికి కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి**
**-ఖమ్మంలో ప్రదర్శన... ఆందోళన**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం వార్త సేకరణలో భాగంగా వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మంలో జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలో జీ తెలుగు రిపోర్టర్ శ్రీ చరణ్ పై సిఐ పిడిగుద్దులు గుద్దడం, లాక్కెళ్లడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా నిరసించారు. ఇటీవల కాలంలో కొందరు పోలీసులు జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఘటనకు కారకులైన సిఐను విధుల నుంచి తొలగించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని ఖమ్మం సిపి సునీల్ దత్‌కు అందించారు. జర్నలిస్టుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, ఎస్‌డి ఖదీర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, యూనియన్ నాయకులు మోహినుద్దీన్, తాళ్లూరి మురళి, శ్రీనివాస్, సాగర్, నాగేందర్‌రెడ్డి, మహేందర్, రవికిరణ్, శ్రీధర్, యాకేష్, టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, రజనీకాంత్, భాస్కర్, ఉపేందర్, వీడియోగ్రాఫర్లు గణేష్, సుధాకర్, వినయ్, శరత్, హరి, శంకర్, ఫోటోగ్రాఫర్లు మహేష్, రవి శంకర్, జగదీష్, జాని తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ నిర్వాకం

**- పగిలిన మిషన్ భగీరథ పైపులైన్**



**ప్రజాపక్షం/ మధిర :** కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిన సంఘటన మండల పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామం సమీపంలో జరిగింది. మధిర విజయవాడ ప్రధాన రహదారిలో ఇల్లెందులపాడు శ్రీ గణేష్ కోల్డ్ స్టోరేజి సమీపంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటులో భాగంగా గుంతలు తీస్తున్న క్రమంలో గుంత కింద ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి మంచినీరు వృధాగా పోతుంది. దీంతో ఇల్లెందులపాడు, దెందుకూరు, ఖమ్మంపాడు గ్రామాలకు తాగునీరు బందైంది. విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ నిర్వాకం వలన మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలటంతో మరమ్మత్తుల పనుల్లో భాగంగా గ్రామాలకు మూడురోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయమేర్పడుతుందని మిషన్ భగీరథ కార్మికులు తెలపటంతో గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌కు కావాల్సిన మెటీరియల్ ఇచ్చేందుకు విద్యుత్‌శాఖ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా యుద్ధప్రతిపాదికన మీషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కుటుంబ నియంత్రణ పాటించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని వైద్యులు నవ్య కాంత్, తబస్సుమ్ ప్రజలను కోరారు. ఆధునిక యుగంలో పతి మానవుడు కుటుంబ నియంత్రణ పాటించాలని, సరైన సమయంలో గర్భధారణ మరియు గర్భముల మధ్య అంతరము తల్లి బిడ్డలకు క్షేమదాయకమని వైద్యులు సూచిస్తున్నారు. మండల పరిధిలోని ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కల్లూరు, చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరిధిలో జాతీయ రహదారి మరియు చెన్నూరులో ప్రధాన రహదారిపై ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం గ్రామాలలో కుటుంబ నియంత్రణ గర్భధారణ మధ్య వ్యత్యాసం ఉంటూ తల్లి బిడ్డలకు క్షేమదాయకంగా, ఆరోగ్యకరంగా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రకారం వివిధ గర్భ నిరోధక మరియు శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు ఇద్దరు పిల్లలు ఇంటికి ముద్దు తదితర అంశాలపై వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల ఆశ లతో గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో పర్యవేక్షకులు వసంత, రామారావు, శ్రీకర్ లతోపాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్వారావుపేట ఎంఇఓగా కీసరి లక్ష్మీ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండల విద్యాధికారిగా కీసరి లక్ష్మీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అశ్వారావుపేట ఎంఇఓగా బాధ్యతలు నిర్వహించిన పి.కృష్ణయ్య, ఇల్లెందు బాధ్యతలు అప్పగించడంతో ఇప్పటికే దమ్మపేట ఎంఇఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న లక్ష్మీ కి అశ్వారావుపేట ఎంఇఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌పిలు, ఐఇఆర్‌పిలు ఎంఇఓకు స్వాగతం పలికారు.

## వ్యవసాయ పనుల కూలీ రేట్లు పెంచాలి



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండల రైతులు వ్యవసాయ పనులకూలీల రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో కూలీ రేట్లు పెంచాలని గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతుకూలీలు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు కూలీలు పత్తి విత్తనాలు వేయడానికి, కలుపుతీతకు రూ.300 ఇవ్వాలని గత రెండు రోజులు ఆందోళన చేస్తున్నారన్నారు. రైతులు రూ.250 ఇస్తామనడంతో కూలీలు ఆందోళన విరమించడం లేదని తెలిపారు. నిత్యవసర సరుకులు ధరలు, కూరగాయలు ధరలు పెరిగాయని రైతు కూలీలు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేయడం సమజసమేనన్నారు. తక్షణమే రైతులందరూ వ్యవసాయకూలీల రేట్లు పెంచాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బంధం వెంకటరాజ్యం, లక్ష్మీ ,సునీత, సరస్వతి పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ నిర్మాణాలకు స్థలాల పరిశీలన



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండలం లోని సధాశివాపురం, కట్టుకాచారాం గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న చెక్‌డ్యామ్ లకు అవసరమైన స్థలాలను గురువారం ఇరిగేషన్ ఈఈ యం.వెంకటేశ్వర్లు, మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్‌రెడ్డి లు పరిశీలించారు. కట్టుకాచారాం లో రూ.7.50 కోట్లు, సధాశివాపురంలో రూ. 4 కోట్ల తో చెక్‌డ్యామ్‌ల ను నిర్మించనున్నారు. ఇందు కోసం ఎక్కడ నిర్మిస్తే ఎక్కువ నీటి నిల్వలు ఉంటాయి. ఎక్కువ రైతాంగం కు ప్రయోజనం ఉంటుంది అనే విషయాల పై క్షేత్ర స్థాయిలో స్థలాలను పరిశీలించారు. అదే విధంగా రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, రమేష్‌రెడ్డి, ఏఈ నరేష్, నేలకొండపల్లి సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య, కాంగ్రెస్ నాయకులు వెన్నపూసల సీతారాములు, కోడాలి గోవిందరావు, పుల్లయ్య, యండ్రాతి శ్రీను, డి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిత్రాలు




**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో విద్యార్థులు విన్నూత కార్యక్రమం ను నిర్వహించారు. గురువారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. దేశంలో పెరుగుతున్న జనాభా వలన కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపగాని రమేష్, ఉపాధ్యాయులు గణేష్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాల లో పని చేసి బదిలీ పై వెళ్తున్న ఉపాధ్యాయులు లను గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. యం. హనుమంతరావు, (ఖమ్మం), యం.పార్వతి(బత్తులపల్లి) లకు బదిలీ పై వెళ్తున్నారు. బదిలీ పై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలో చేసిన కాలంలో వారు అందించిన సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపగాని రమేష్ మాట్లాడారు....ఉపాధ్యాయులు వృత్తి పట్ల అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ ఫిలిం షూటింగ్ విజయవంతంగా పూర్తి



**ప్రజాపక్షం/ మధిర :** ఖాజీపురం గ్రామానికి చెందిన యువ దర్శకుడు ఎఆర్.సమీర్ తానే హీరోగా నటిస్తూ రూపొందిస్తున్న సందేశాత్మక షార్ట్ ఫిలిం 'ఓటు ఎంత' షూటింగ్ గురువారం విజయవంతంగా పూర్తి అయినట్లు యువ దర్శకులు సమీర్ తెలిపారు. ఈ చిత్రంలో మధిరకు చెందిన కొలివాయి శ్రీధర్‌శర్మ, మిట్టగూడెంకు చెందిన తన్నీరు చలపతిరావు, గోసవీడు అంజి, మామునూరు గ్రామానికి చెందిన వై.అనంత్‌రామిరెడ్డి ముఖ్యపాత్రల్లో నటించారని తెలిపారు. ఈ చిత్రం అతి త్వరలోనే ఎఆర్ సమీర్ టాకీస్ మధిర యూట్యూబ్ చానెల్‌లో విడుదల కానున్నదని తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

# మహిళలు ఆర్థికంగా శక్తివంతులు కావాలి



## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, ఏపిఎం, సిఏ మహిళా సమైక్య సంఘాల బాధ్యులతో మహిళా శక్తి పథక అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వాలంభనకు సహకరించడం మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు అన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళా శక్తి పథకంలో భాగమన్నారు. జిల్లా మండల మహిళా సమాఖ్యలు వారు స్వంతంగా నిర్వహించగలిగే యూనిట్లు ఎంచుకోవాలన్నారు. ఆయా యూనిట్ల నిర్వహణపై అనుభవం ఉంటే లాభసాటి అవుతుందన్నారు. మహిళా శక్తి కుట్టు కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పని అయిపోయినందున ఖాళీగా ఉండగా, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ ఆర్డర్లు పొందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యూటీ పార్లర్, నాటుకోళ్ల పెంపకం, పాడి గేదెలు, టెంట్ హౌజ్ తదితర యూనిట్లపై చర్చించారు. ప్రతి మండలంలో ఎంపిడివో, ఏపిఎం, మండల సమైక్యలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని మండల మహిళా శక్తి ప్లానింగ్ సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్‌డివో సన్యాసయ్య, జెడ్పి సిఈఓ ఎస్. వినోద్, సింగరేణి మహిళా సమైక్య అధ్యక్షురాలు సుహాసిని, పెనుబల్లి మండల సమైక్య కోశాధికారి రాధిక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు

## వైద్య కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భవిష్యత్తు తరాలకు అనుగుణంగా ఆదర్శ వైద్య కళాశాలల భవ న నిర్మాణాలు ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని బల్లేపల్లి, రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం సర్వే నెంబరులో గల 40 ఎకరాల భూమిలో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వైద్య కళాశాల నిర్మాణాలు ఉండాలన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టాలని, స్థల సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలం మొత్తం కలియ తిరుగుతూ కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణాలకు సంబంధించి అధికారులను



వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ హేమలత, ఖమ్మం ఆర్డివో గణేష్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, తహసీల్దార్లు స్వామి, విల్సన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటి కళాశాలకు అటానమస్

## కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల కు జెఎన్‌టియు అనుమతితో ప్రతిష్టాత్మక అటానమస్ స్టేటస్ ను భారత ప్రభుత్వ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రకటించడం పట్ల కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. అటానమస్ స్టేటస్ పది సంవత్సరాలు (2024 నుండి 2034) వరకు వర్తిస్తుందని ఆయన తెలిపారు. అటానమస్, న్యాక్ ఏ ప్లస్ రావడం ఒక మైలు రాయి వంటిదన్నారు. కేవలం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కళాశాలలకు మాత్రమే దక్కిన ఈ హోదా ఇప్పుడు ఖమ్మం జిల్లాలో కేవలం తమ కళాశాలకు మాత్రమే దక్కడం గర్వకారణమన్నారు. ఈ స్వయం ప్రతిపత్తి వల్ల విద్యార్థులు దూర ప్రదేశాలకు వెళ్లి వ్యయ ప్రయాసాలు పడకుండా ఖమ్మంలోనే అత్యాధునీక ప్రమాణాలతో విద్యను అభ్యసించడానికి వీలు ఉంటుందని ఆయన తెలిపారు. అటానమస్ స్టేటస్ వల్ల సిలబస్‌ను రూపొందించడానికి అకాడమిక్ షెడ్యూల్స్, ఎవాల్యూయేషన్, రిసెర్చ్ తదితర ఉపయోగాలు ఉంటాయన్నారు. అటానమస్, న్యాక్ ఏ



గ్రేడులు ఉన్న కళాశాలలకు హెచ్‌సిఎల్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి బహుళ జాతి కంపెనీలు ప్లేస్ మెంట్స్ కొరకు రావడం జరుగుతుందన్నారు. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీలో ప్రవేశాలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని గుండాల కృష్ణ తెలిపారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణ, అత్యాధునీక ల్యాబ్స్, లైబ్రరీ, అర్హత కలిగిన అధ్యాపక బృందాన్ని నియమించడంలో ఎస్‌బిఐటి రాజీ పడలేదని ఆమె తెలిపారు. ప్రపంచ పోకడలకు అనుగుణంగా కళాశాలను తగిన విధంగా తీర్చిదిద్దడం వల్లే తమ కళాశాలకు అటానమస్ రావడం సాధ్యమైందన్నారు. అధ్యాపకులకు, విభాగాధిపతులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలకు అటానమస్ వచ్చిన సందర్భంగా గురువారం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ విశ్వనాథం విప్లవ జోహార్లు

**ప్రజాపక్షం/కారేపల్లిః** సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన కామ్రేడ్ విశ్వనాథం సంతాప సభ గురువారం ఇల్లందు 21లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా డివిజన్ నాయకుడు గుగులోతు తేజనాయక్ మాట్లాడుతూ కామ్రేడ్ విశ్వనాథం ఇల్లందు మండలం రొంపేడులో పేద దళిత కుటుంబంలో 13.06.1962లో జన్మించాడు. ఇల్లందు మెయిన్ రోడ్డు హైస్కూల్‌లో ౯వ తరగతి వరకు చదువుకున్నాడని అన్నారు. ఇల్లందు ప్రాంతంలో పనిచేస్తున్న ప్రతిఘటన పోరాట దళాలతో ప్రభావంతో చైతన్యవంతమైన



ప్రజాక్షేత్రంలో వచ్చాడని ఆయన గుర్తు చేశారు. ఇల్లందు ప్రాంతంలో జరుగుతున్న దోపిడి పీడనకు గుండాయిజం రౌడీ గ్యాంగులకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కూలీల వేతనాల కోసం రైతు సమస్యలపై ఆదివాసి సమస్యలపై నిరంతరం ప్రజాపోరాట మార్గంలో ఎంచుకున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ మండల నాయకులు తాటి పాపారావు, ధరావత్ సక్రునాయక్, విటల్‌సింగ్, గుగులోతు హరిదాస్, సనప భద్రయ్య, ఆదినారాయణ, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వాసిరెడ్డి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు వితరణ చేశారు. ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు వితరణ చేయాలని పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోతికుమారి వాసిరెడ్డి సేవా సమితి ట్రస్టును సంప్రదించారు. ఆమె విజ్ఞప్తి మేరకు వాసిరెడ్డి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 500 నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సేవా సమితి ట్రస్టు సభ్యులు వీరభద్రరావు, నాగేశ్వరరావు, అర్జున్‌రావు, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అంజనికుమారి, ఉమాదేవి, జ్యోతికుమారి, శ్యామ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఖలీల్ బ్రదర్స్‌కు మాతృవియోగం

## - ఫోన్ ద్వారా సానుభూతిని వ్యక్తం చేసిన ఎంపీ రఘురాంరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన కేకే ఇన్ఫ్రా, నన్నేసాహెచ్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఖలీల్ బ్రదర్స్‌కు గురువారం మాతృవియోగం జరిగింది. వారి తల్లి గౌసియాబేగం(80) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని కిమ్స్ హాస్పిటల్‌లలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. కాగా ఇంటి వద్ద ఉన్న ఆమెకు సడన్గా గుండెపోటు రావడంతో ఇంటి వద్ద మృతి చెందారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంట్ శాశససభ్యులు రామసహాయం రంఘురాంరెడ్డి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే డోర్నకల్ ఎమ్మెల్యే రామ్‌చంద్రునాయక్ ఫోన్ ద్వారా పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ నాయకులు దండి రంగారావు, వెంపటి సురేందర్, బొబ్బిలి కృష్ణ, ట్రాఫిక్ సిఐ అంజలి, కాంగ్రెస్ నాయకురాలు భవానిరెడ్డి, హఫీజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, సుగుణ హాస్పిటల్ డైరెక్టర్ సి.పవన్‌కుమార్, రఘువీర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేష్, సాజిద్, మౌలానా, రియల్‌వ్యాపారులు తదితులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లిలో గల కోతులగుట్ట సబ్‌స్టేషన్‌పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్, మద్దులపల్లి, తల్లంపాడు ఇండస్ట్రియల్ ఫీడర్‌ల మెయింటినెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని, ఏఈ కాంతిసింహ గురువారం ఓ ప్రకనటలో తెలిపరు. ఇందులో భాగంగా మద్దులపల్లి, పొన్నెకల్లు, తల్లంపాడు పంచాయతీల పరిధిలో ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు అంతరాయం కలగనుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

# రాష్ట్రపతి, ప్రధాని ఎవరైనా గురువులకే ప్రత్యేకస్థానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతి, ప్రధానిమంత్రి అయినా ఎవరైనా గురువులకే ప్రత్యేక స్థానం ఉంటుందని, గురువులు కన్పిస్తే ఎవరైనా నమస్కరించాల్సిందేనని అంతటి మహోత్తరమైన స్థానం ఉపాధ్యాయులకే దక్కుతుందని తల్లాడ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తల్లాడ మండలంలోని రెడ్డిగూడెం(కొడవటిమెట్ట) ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన స్పందన, వరప్రసాద్‌లకు జరిగిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం గ్రామ మాజీ సర్పంచ్ బద్దం నిర్మలకోటిరెడ్డి అధ్యతక్షన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ టీచర్ అనగానే పాఠాలు చెప్పి వెళ్లిపోయామా అనేది కాకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది మంచి విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులతో పాటు వాళ్ళ తల్లిదండ్రులు మన్నలను పొందటం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులుగా కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా రాణించారని, వారిసేవలను గుర్తు చేశారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బద్దం కోటిరెడ్డి, పైడిపల్లి రవి, ఉపాధ్యాయులు సునీత, శివరాణి, ఎస్ఎంసి మాజీ ఛైర్మన్ మోదుగు రజిని తదితరులు పాల్గొన్నారు.

# పచ్చిపాల భద్రయ్యకు పరామర్శ



**ప్రజాపక్షం/కారేపల్లిః** వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కి పచ్చిపాల భద్రయ్య 1ఎకరం ౨౦ గుంటల భూమి వారికి ఇప్పించినందుకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నామని పచ్చిపాల వెంకట్, బోడా రవి పేర్కొన్నారు. సింగరేణి మండల అఖిల పక్ష ముఖ్య నాయకులకు నిజాన్ని నిర్భయంగా బయట ప్రపంచానికి తెలియపరిచే పత్రిక విలేకరుల సోదరులందరికి అందరికి పేరుపేరునా శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేశారు. పచ్చిపాల భద్రయ్య కుటుంబ సభ్యులకు సహకరించి న్యాయం ధర్మమే గెలుస్తుందని, ముందుకు నడిపించినటువంటి ప్రతిఒక్క అన్నకి, తమ్ముడికి, అక్కలకు, అమ్మలకు న్యాయమే గెలవాలని చాలా దూర ప్రాంతాల నుంచి కోరుకునేటువంటి మంచి గెలవాలని పూర్తి మద్దతు సహాయ సహకారాలు అందించిన వారందరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. పచ్చిపాల భద్రయ్య భూమి విషయంలో న్యాయం జరగాలని కోరుతూ సహకరించిన ప్రతిఒక్కరూ నిజాయితీగా పనిచేశారని, అందరి సహకారం వల్లే భద్రయ్యకి 1ఎకరం20 గుంటల భూమి చెందడం జరిగిందని, ఒక్క రూపాయి అనేది ఆశించకుండా మనస్ఫూర్తిగా పనిచేశారని, వారందరికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని అన్నారు.

## సాంకేతికత విద్య ఎంతో అవసరం : జారే



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : విద్యావిధానంలో సాంకేతికత కూడిన విద్య ఎంతో అవసరమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. అశ్వారావుపేటలో సాంకేతిక విద్యార్థుల వికాసంపై ఫ్యూచరిస్టిక్ ఆన్ వీల్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు సాంతికేతికత విద్యపై మక్కువ పెంచుకోవాలని, తద్వారా సమాజంలో వస్తున్న మార్పులకు అనేక ఆవిష్కృతాలు సాధ్యమవుతుందని అన్నారు. సాంకేతికతను ప్రోత్సహిస్తూ విద్యావిధానంలో మార్పులు తీసుకురావటం ప్రధానం అన్నారు. సిఇఓ మధుబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో టెక్నాలజీని పెంపొందించేందుకు తమ సంస్థ ద్వారా రాబోవు జనరేషన్ ఇన్నోవేషన్ కార్యక్రమాల్లో మార్పులు తీసుకురావటం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, సిఐ కరుణాకర్, హెచ్ఎం హరిత, వికెడివిఎస్ రాజు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు, మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

## 15న పెన్షనర్స్ జేఏసి ఆందోళన



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పెన్షనర్ జేఏసి నాయకులు పరిశ పుల్లయ్య నేడొక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని ఈహెచ్ ఎస్ స్కీం ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింప జేయాలని, పెన్షనర్ల బేసిక్ పెన్షన్ నుండి ఒక శాతం ప్రకారం తమ వాటా చెల్లించుటకు పెన్షనర్లు సిద్దంగా ఉన్నారని పుల్లయ్య తెలిపారు. ప్రతి జిల్లాలో కనీసం రెండు ఫిట్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్యులు, మందులు, పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు మూడు నెలల్లో చెల్లించాలని పెన్షనర్ల జేఏసి డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు. పెన్షనర్ల భవన్ నిర్మాణం కొరకు హైదరాబాద్ నగరంలో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని పుల్లయ్య తెలిపారు. 15న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ఆయన పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు.

## వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరుః మణుగూరు మండల కేంద్రంలోని సమితి సింగారం గ్రామ పంచాయితీ పరిధిలో గల గిరిజన బాలుర వసతి గృహాన్ని గురువారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాలకు ప్రహారిగోడ నిర్మాణం చేయించాలని ఉపాధ్యాయులు కోరగా ఎంత మేరకు నిధులు అవసరం అవుతాయో వివరాలు అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ప్రజాపక్షం/వైరాః వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం వైరాలో వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతలపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంతోమంది వీధి వ్యాపారులకు ఎండ నుండి రక్షించుకునేందుకు గొడుగులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి అబ్బూరి రమేష్, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, కాటేపల్లి రామకృష్ణ, తాడికొండ రాము, చెరుకూరి శ్రీనివాసరావు, దావులూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల నిరసన



ప్రజాపక్షం/వైరాః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వైరా మండలశాఖ పక్షాన విశ్రాంత ఉద్యోగులు గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, టివి.కృష్ణయ్య సూరి, ఎన్.పెంటయ్య, షేక్ వలీజాన్, ఎం.వాసుదాసు, చల్లా కృష్ణారావు, అరుణ, సుబ్బయ్య, పిచ్చిరెడ్డి, పంతులు, పురుషోత్తం రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పనులు త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖ, మండల సమైక్యలతో పనుల పురోగతిపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా కేటాయించిన పాఠశాలలు, పనుల పూర్తి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై తరగతులు నడుస్తున్నట్లు, అధికారులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని మంజూరు పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగానికి 423 పాఠశాలలు కేటాయించగా 248 పనులు పూర్తి కాగా 175 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం చే 51 పాఠశాల పనులు చేపట్టగా 30 చోట్ల పనులు పూర్తయ్యాయని 21 చోట్ల వివిధ దశల్లో ఉన్నాయన్నారు. విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 177 పాఠశాలల పనులు చేపట్టగా 104 చోట్ల పూర్తయ్యాయని 73 చోట్ల పురోగతిలో ఉన్నాయన్నారు. రోడ్లు, భవనాల శాఖ చే 260 పాఠశాలల పనులకు గాను 112 చోట్ల పనులు పూర్తయ్యాయని, 148 చోట్ల పురోగతిలో ఉన్నాయన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం చే 44 పాఠశాలల అభివృద్ధి పనులకు గాను 14 చోట్ల పనులు పూర్తి కాగా 30 చోట్ల పురోగతిలో ఉన్నాయన్నారు. నిధులకు ఎలాంటి సమస్య లేదని పూర్తయిన పనులకు వెంట వెంటనే ఎంబి రికార్డు చేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడివోలు, ఎంఈవోలు, మండల పరిధిలోని అధికారులతో సమీక్ష చేసి పనుల పూర్తికి కార్యాచరణ సమర్పించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతి పాఠశాలను సందర్శన చేయాలని పనుల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. విద్యా, వైద్యం ఎంతో ప్రాముఖ్యత గల అంశాలని విద్యపరంగా వసతుల కల్పనకు అధికారులుగా ఇది మంచి అవకాశమని తెలిపారు. మంచి పాఠశాలలు, మంచి వసతులు ఉంటే పిల్లలకు జీవితాలు మెరుగుపర్చుకోవడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. వచ్చే నెల రోజుల్లో అన్ని పాఠశాలల పనులు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్‌డివో సన్యాసయ్య, జెడ్పి సిఈవో ఎస్. వినోద్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, సిపివో శ్రీనివాస్, వివిధ శాఖల ఈఈలు, డిఈలు, ఏఈలు, సమైక్య బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు**




ప్రజాపక్షం/బోనకల్ః మండలంలోని రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశం ఆకెన పవన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత తెలంగాణలో గత పది సంవత్సరాలు పరిపాలించిన బారాస ప్రభుత్వం భూములకు సంబంధించి ధరణి అనే కొత్త విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ధరణి విధానంతో నాటి నుండి నేటి వరకు అనేకమంది ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా భూసమస్యలు మాత్రం తీరలేదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) మండల సమితిగా మేము అన్ని గ్రామాలల్లోని భూసమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికీ 70 శాతం భూసమస్య పరిష్కారం కాలేదంటే సమస్య ఎంత జఠిలంగా ఉందో అర్థమౌవుతుందని పేర్కొన్నారు. ధరణి సమస్యతోపాటు వివిధ గ్రామాల్లో రైతులకు రైతులకు మధ్య, రైతులకు ప్రభుత్వానికి మధ్య,రైతులకు ఇరిగేషన్ శాఖకు మధ్య, దారులు చెరువుల విషయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు, శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్ని ధర్నాను విజయవంతం చేయగలరని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు పారుపల్లి నరసింహరావు, ఏనుగు రవికుమార్, బుర్రినాగేశ్వరరావు, ఏలూరిపూర్ణచంద్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, బెజవాడ నరేష్, యంగల పెద్దరమేష్, బోళ్ల ప్రసాదరావు, మరీదు ఈశ్వరమ్మ, తోటపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

# లాంఛనంగా అత్యాధునిక టైర్ మౌంటెడ్ రఫ్‌భారీ క్రేన్ ప్రారంభం



ప్రజాపక్షం/మణుగూరుః ట్రాక్టర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి చెందిన 40 టన్నుల కెపాసిటీ గల అత్యాధునిక టైర్ మౌంటెడ్ రఫ్‌భారీ క్రేన్ ను 1.44 కోట్లకు సింగరేణి యాజమాన్యం కొనుగోలు చేసి మణుగూరు ఏరియా పికెఓసి2 కేటాయించగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ గురువారం డంపర్ సెక్షన్ నందు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ మణుగూరు ఏరియా అవసరాన్ని గుర్తించి యాజామాన్యం భారీ క్రేన్ ను కేటాయించడం మనకు వృత్తి పరంగా అదనపు శక్తి చేకూరినట్టు అయిందన్నారు. క్రేన్‌ను జాగరత్తగా వాడుకుంటూ క్రేన్ నిర్ణీత జీవిత కాలాన్ని మించి వినియోగించుకునేలా నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిన భాద్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఓ వెంకటరమణ, ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్ఐఓసి శ్రీనివాస చారి, డిజిఎం(ఐఈ), కే. వెంకట్ రావు, డిజిఎం(కేసిహెచ్పి), మధన్ నాయక్, ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టీయూసి నాయకులు గట్టయ్య, సిఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షులు కే. కృష్ణమూర్తి, మేనేజర్ పికేఓసి2 సురేశ్ , ఎస్ఈ (ఈ&ఎం) డి. శ్రీనివాస్, రాజ శేఖర్ , సతీశ్ , డివై.ఎస్ఈ (ఐఈ) శ్రీనివాస్, ఇతర అధికారులు, ఫిట్ సెక్రెటరీ పెర్వేజరు మరియు ఓసి2 డంపర్ సెక్షన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌ఏను కలిసిన సేవాదళ్ నాయకులు




ప్రజాపక్షం/భద్రాచలం : సేవాదళ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకటరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి షాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవదళ్ నాయకులు ప్రజలకు మంచి సేవలు అందించి ప్రశంసలు పొందాలని, ప్రజాక్షేత్రంలో ఎదురయ్యే సవాళ్లను శిషితంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు పిలకా వెంకట రమణారెడ్డి, దుమ్ముగూడెం అధ్యులు కొమ్ము రంజిత్ కుమార్, చర్ల అధ్యక్షులు చల్లకోటి వాసుదేవరావు, వెంకటాపురం అధ్యక్షులు గడపాటి ఆదిత్య, వాజేడు అధ్యక్షులు రాగింవేలకల రాంబాబు, చంద్ర గొండ అధ్యక్షులు బలంగా శ్రీనివాసరావు, కార్యదర్శి కుదుమూరి దయాకర్ రావు, అశ్వారావుపేట బి బ్లాక్ అధ్యక్షులు లక్ష్మ ణరావు, చేపలమడుగు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వల్పంగా పెరుగుతున్న గోదావరి





ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి నదిలో నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. ప్రస్తుతం నదిలో 12 మేర నీరు ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా వాంగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. దీంతో ఆ నీరంతా పల్లపు ప్రాంతాలకు ప్రవహిస్తో గోదావరికి వచ్చి చేరుతున్నాయి. గోదావరికి ఎగువన ఉన్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల్లోకి చేరుతున్న వర్షపు వరద నీటితో గోదావరికి తాకిడి పెరిగింది. చర్ల మండల పరిధిలోని తాలిపేరు మధ్యతరహా నీటి ప్రాజెక్టులో జలకళ సంతరించుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా అడవుల్లో పడిన నీరుంతా దిగువన ఉన్న తాలిపేరుకు చేరుతోంది.

**వర్షాకాలం వచ్చిందంటే...**

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఏజెన్సీని గోదావరి భయం వెంటాడుతుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో పరివాహక ప్రాంతాల్లో గోదావరి పెద్ద ఎత్తున ప్రవహిస్తుంటుంది. నదికి ఇరువైపులా ఉన్న రైతులు పంటలు వేసేందుకు కూడా ఆలోచిస్తుంటారు. ఎక్కువగా గోదావరికి ఆగస్టు నెలలో భారీ వరదలు వస్తుంటాయి. కొన్ని సార్లు జూలై నెలాఖరుల్లో కూడా వరదలు వచ్చాయి. ఇప్పటికే గోదావరి వరదలను ఎదుర్కునేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మూడు మాసాలకు కావాల్సిన బఫర్ స్టాక్‌ను కూడా సిద్ధం చేశారు. వరద శరణార్థుల కోసం సహాయక శిబిరాలను గుర్తించారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో కలిసికట్టుగా వరదల్లో పనిచేయాలని మౌకిక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా వరదల్లో అత్యవసర సేవలు అందించేందుకు డిడిఆర్ఎఫ్ బృంధాలను ఎస్పి నేతృత్వంలో ఏర్పాటయ్యాయి. ఇప్పటికే వారికి శిక్షణ కూడా పూర్తయ్యింది.

# పూర్తికాని అమ్మ ఆదర్శ పాఠశాల పనులు..!






ప్రజాపక్షం/కరగూడెంః కరకగూడెం మండల పరిధిలోని తుమ్మలగూడెం పంచాయతీ రెగుళ్ళ గ్రామంలో పాఠశాల ప్రారంభమై నెల రోజులు అయినా అమ్మ ఆదర్శ పాఠశాలలో మైనర్ రిపేరింగ్ పనులు కాక, వాటర్ సదుపాయం లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.. ఏ ఒక్క పని కూడా పూర్తి కాలేదు. స్కూల్లో ఫ్యాన్లు ఫీడ్ చేశారు. ఆపైన స్లాబ్ శిధిలా వ్యవస్థకు చేరుకుంది. ఆ పైన కప్పులు ఎప్పుడు పడతాయో తెలియదు. పిల్లలకి ఏమైతుందో తెలియదు. పిల్లలని స్కూలుకు పంపాలంటేనే తల్లిదండ్రులు ఆందోళనకు గురై పిల్లలను స్కూలు కూడా పంపడం లేదు. సుమారు రూ. 4.20 లక్షలు మైనారిపురం కోసం శాంక్షన్ అవ్వగా ఏ యొక్క పని కూడా పూర్తి కాగా బిల్లులు మాత్రం కాజేస్తున్నారు. ఈ బిల్డింగ్ మైనర్ రిపేరింగ్ కాంట్రాక్టర్ ని అడగగా రేపు వచ్చి చేస్తా, ఎల్లుండి వచ్చి చేస్తా అంటూ ఎన్నిసార్లు అడిగినా ఇదే సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. ఎండాకాలంలో అవ్వవలసిన పనులు ఇంకా పూర్తి కాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్కూల్ మైనర్ రిపేర్లు చేర్పించాల్సిందిగా గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# వైరా రిజర్వాయర్‌పై కోనో కార్పస్ చెట్లు తొలగింపు






వైరా రిజర్వాయర్ ఆనకట్ట చెట్లపై మార్నింగ్ వాకర్స్ ఆందోళన

-శ్వాసకోశ వ్యాధులు వస్తాయని భయపడుతున్న వాకర్స్
-కట్టపై చెట్లతోనే ప్రమాదం అంటున్న ప్రజలు

ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని రిజర్వాయర్, సెంటర్ డివైడర్ మధ్యలో ఉన్న కోనో కార్పస్ చెట్లు ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందికరంగా మారడంతో ఈ నెల౹౹వ తారీఖున ప్రజాపక్షం దినపత్రికలో వైరా రిజర్వాయర్ ఆనకట్ట చెట్లపై మార్నింగ్ వాకర్స్ ఆందోళన, ఈ నెర్లన కోనో కార్పస్ చెట్లు తొలగించరా అనే వరుస కథకాలను ప్రచురించడం జరిగింది. ఈ కథనాలకు స్పందించిన మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు ఆరోగ్యం పట్ల ఇబ్బందికరంగా మారిన కోనో కార్పస్ చెట్లను గురువారం తొలగించడం ప్రారంభించారు. ఈ చెట్ల తొలగింపును మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపాల్ కమీషనర్ వేణుతో కలిసి మున్సిపాల్ సిబ్బందిని ఏర్పాటు చేసి తొలగించడం ప్రారంభించారు. తొలగించిన చెట్లను ఎప్పటికప్పుడు ట్రాక్టర్లపై బయటకు తరలించారు. దీంతో చెట్లు తొలగించడం ప్రారంభించడం పట్ల ప్రజాపక్షం కథనానికి మున్సిపాలిటీ చైర్మన్ జైపాల్‌కు, మున్సిపాలిటీ కమీషనర్ వేణుకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది



ప్రజాపక్షం/అశ్వాపురం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంపిటిసి కమటం నరేష్ అన్నారు. గురువారం మొండికుంట గ్రామ పంచాయితీలోని ఎంపిపిఎస్‌లో సుదీర్ఘకాలం పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయునీయులకు ఘనంగా ఆయన ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని దేశ భవిష్యత్తు నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉన్నదని, విద్యతోనే దేశం అభివృద్ది చెందుతుందన్నారు. మన స్థానిక పాఠశాలలో పిల్లలకు బోధనతో పాటు, క్రమ శిక్షణ, పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయునీలకు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం గ్రామ పెద్దలు శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం సుధాకర్, పెద్దలు మస్సు శ్రీనివాసరెడ్డి, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పినికేసి సుధాకర్ రెడ్డి, పులసని రామిరెడ్డి, బండారు రవీందర్‌రెడ్డి, కందాల ఈశ్వర్, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశ వర్కర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్త చట్టాలపై విద్యార్థినులకు అవగాహన




ప్రజాపక్షం/చంద్రుగొండ: జూలై 1 నుండి వచ్చిన కొత్త చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి సమాచారం రాబట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వాటిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికలు బాల్య వివాహాలు చేసుకుంటే నేరమన్నారు. ఈకార్యక్రమంలో జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, స్థానిక ఎస్ఐ మాచినేని రవి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణంపై రాజకీయ జోక్యం తగదు



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండలో ఏర్పాటు చేసే డ్రైనేజీ విషయంలో ఇతర గ్రామాల రాజకీయ నాయకులు జోక్యం తగదని గ్రామ అఖిలపక్ష నాయకులు అన్నారు. గురువారం చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుండి జూలూరుపాడు వెళ్లే లంకలవాగు ముత్యాలమ్మగుడి వద్ద వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి రూ 3కోట్ల 20లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఇరువైపులా ఉన్న గృహాలు కోల్పోయే యాజమానులు అఖిలపక్షంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ28 అడుగులు రోడ్డు ఏర్పాటు చేసి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆది నారాయణకు తెలియజేయడం జరిగిందన్నారు. 28 అడుగులు పైబడి రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేస్తే పూర్తిగా ఇల్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఇల్లు కోల్పోయే బాధితులు సంకరామారావు, దడిగలు మల్లేష్, భద్రం, భోగి కృష్ణ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా వీరభద్రం



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ ఆటో యూనియన్ ఏఐటియూసి అధ్యక్షుడిగా మల్కం వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నవీన్, ఉపాధ్యక్షుడిగా పత్తపాటి మోహన్‌రావు, కోశాధికారిగా రేపాల కోటేశ్వరరావులతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైనా వీరభద్రం మాట్లాడుతూ ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలన్నారు.

## గంజాయి, డ్రగ్స్‌కు యువత బానిస కావొద్దు



ప్రజాపక్షం/ములకలపల్లి: గంజాయి, డ్రగ్స్‌కు యువత బానిస కావొద్దని జెడ్‌పిటిసి సున్నం నాగమణి, ఎంపిటిసి శనగపాటి మెహరామణిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శనగపాటి సీతారాములు ఇంటి దగ్గర సమావేశంలో వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరోకు గాని, పోలీసులు గాని సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు 8712671111నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి నిల్వ, సరఫరాకు సంబంధించిన సమాచారం ఇచ్చిన వారికి తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో రూ 2లక్షల రివార్డు ఇస్తారన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కోరారు.

## రాయల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్




ప్రజాపక్షం/వైరాః హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆయన చాంబర్‌లో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులురాలు దొబ్బల సౌజన్య, వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కొణిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే నారాయణరావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఆషాడం వచ్చింది..గోరింటాకు పండింది...







**-మహిళలు ఆషాడంలో ఆనందంగా జరుపుకునే గోరింటాకు పండుగ**
**-అందం...ఆరోగ్యం...అతివలకు**

ప్రజాపక్షం/వైరాః గోరింటా పూసిండి కొమ్మ లేకుండా మురిపాల అరచేత మొగ్గ తొడిగింది అన్నాడు ఓ సిని కవి. కృత్రిమ ఎరుపు కంటే ఆరోగ్యం ఇచ్చే గోరింట మిన్న ఆషాడం వచ్చింది అంటే చాలు గోరింటాకు ప్రతి ఒక్క మహిళలకు గుర్తొస్తుంది. ఆషాడ మాసం ముగిసే లోపు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవాలని పూర్వికులు చెబుతారు. అందుకే ఆషాడం అంటే గోరింటాకు పండుగ అంటారు. గోరింటాకు చేతులకు పెట్టుకొని యువతులు ఎంతో మురిచిపోతూ ఉంటారు. శుభకార్యాలు పండుగలు ఆషాడ మాసంలోనే, ఔషదణాలు గోరింటాకులో ఎక్కువగా ఉంటాయి. ఇటీవల కాలంలో మహిళలందరూ ఒకేచోట చేరి మెహంది పడుగ గాను చేసుకోవడం. కిట్టి పార్టీలో కూడా ఆషాడ మెహింది పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు ఒకచోట గోరింటాకు పెట్టుకునేటప్పుడు మహిళలు ఎంతో సందడిగా ఉత్సాహంతో ఉంటారు. చర్మవ్యాధులు రాకుండా వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధులు రాకుండా రక్షించుకోవచ్చు అనేది ఎప్పటి నుంచో వస్తున్న మన సంప్రదాయం ఆరోగ్య రహస్యం, ఆషాడ మాసంలో వర్షాలు ఎక్కువగా కురవడంతో పొలాలు బురదగా మరి క్రిమికీటకాలు వస్తుంటవి. మహిళల పొలాల్లో వరినాట్లు వేయడం వలన చేతులు కాళ్ళకు బురద అంటుకుంటుంది. ఈ ఆషాడ మాసంలో మైదాకు పెట్టుకుంటే చర్మ వ్యాధులు రాకుండా కాపాడుతాయని వైద్యులు పలువురు చెబుతున్నారు.

### ఆషాడ మాసం యొక్క ప్రత్యేకత...

ఆషాడ మాసంలో ఏదో ఒక రోజు గోరింటాకు పెట్టుకోవాలి అనేది మన పూర్వీకులు చెప్పిన సంప్రదాయం. ఆనాటి నుండి సాంప్రదాయాలు అదేవిధంగా నేటి వరకు కొనసాగుతున్నాయి. గోళ్ళకు రంగును ఇచ్చే గోరింటాకు సఖరంజని అనే పేరు కూడా ఉంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేటి ఆధునిక కాలంలో గోరింటాకు పేరుతో రకరకాల కోన్లూ పేస్టులు మహిళలకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ కోన్లు పేస్టులు రంగును అందాన్ని ఇస్తాయి తప్ప వాటిలో ఎలాంటి ఔషధ గుణాలు ఉండవు.

### గోరింటాకు ప్రయోజనాలు...

మైదాకు వేళ్లకు పెట్టుకోవడం, గోళ్ళు పెలుసు బారిపోకుండా కాపాడుతుంది. ఆకులే కాకుండా పూలు, వేర్లు, బెరడు విత్తనాలు కూడా ఔషధ యుక్తాలే. వీటితో శరీరంలోని ఎలర్జీను దూరం చేసుకోవచ్చు. బోధకాలు వ్యాధి ఎలాంటి దరిచేరదు. నెలకు ఒకసారి గోరింటాకు ముద్దను తలకు ప్యాక్ చేసుకుంటే జుట్టు బలపడి రాలదుంటాకు ఉంటుంది. గోరింటాకు పొడి కాచిన నూనె వాడడం చిట్కా వైద్యంలో ఒకటి. గోరింటాకు ముఖ్యంగా ఒంట్లో వేడిని తగ్గిస్తుంది.

### గోరింటాకు తయారు చేసే విధానం...

మైదాకులో చింతపండు వేసి మధ్యలో కొద్దిగా మజ్జిగా వేసి రోట్లో రుబ్బాలి. మిక్సీలోన నాణ్యమైన గోరింటాకు ఇత్తలూ ఆకులు పొడిని వేడి నీళ్ళలో కలిపి రాత్రంతా నానబెడితే మంచి రంగులోకి మారుతుంది. మెహందీకు కాపా పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి. తర్వాత రోజు పెట్టుకోవాలి దీంతో కాపీ బ్రౌన్ కలర్‌లో పండుతుంది. నెంబర్ వసంతంలో పంచదార తయారు చేసుకోవాలి. పెన్నాకు కాపీ పొడిని కలిపి రాత్రంతా నానబెట్టాలి తర్వాత రోజు పెట్టుకోవాలి.

### సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక : కర్నాటి నందిని, 10వ వార్డు కౌన్సిలర్ గండగలపాడు



ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది సంస్కృతి సాంప్రదాయంగా వచ్చే ఆనవాయితీ, వర్షాకాలం వస్తే ఆరోగ్య బారిన పడకుండా గోరింటాకు శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తుంది. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. అని వైరా మున్సిపాలిటీ గండగలపాడు 10వ వార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని తెలిపారు.

### చిన్ననాటి నుండి వస్తున్న ఆచారం : వుంద్రు వరలక్ష్మి



ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం అనేది చిన్ననాటి నుండి ఒక ఆనవాయితీ చిన్నతనం నుండి గోరింటాకు పెట్టుకుంటున్నాను. గోరింటాకును పోసి రోట్లో వేచి దంచి పాడపాడుతూ ఒకే చోటకు చేరి గోరింటాకును పెట్టుకునే వాళ్ళం అని లయన్ వుంద్రు వరలక్ష్మి అన్నారు.

### గాజులు ఇచ్చి పుచ్చుకుంటాం : బత్తుల గీత 2వ వార్డు కౌన్సిలర్ వైరా



ఆషాడం వచ్చింది అంటే గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. ఆషాడం వచ్చిందంటే ముందుగా గుర్తిచ్చేది గోరింటాకు. అందరం ఒకేచోట చేరి గోరింటాకు పెట్టుకోవడంతో గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. అమ్మవారికి పూజలు నిర్వహించి గోరింటాకు పెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని కౌన్సిలర్ బత్తుల గీత తెలిపారు.

### అనాదిగా వస్తున్న ఆచారం : మరికంటి డేడికుమారి 1వ వార్డు కౌన్సిలర్ వైరా



గోరింటాకులో మంచి ఔషద గుణాలు ఉన్నాయి. గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. సాంప్రదాయమే కాకుండా వాతావరణంలో వచ్చే మార్పుల వలన శరీరంలో వచ్చే మార్పులను తొలగించే మంచి ఔషధం గోరింటాకు ఉంది. అందుకే ఆషాడంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకుంటాం అని వైరా మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ మరికంటి డేడికుమారి అన్నారు.

### సంప్రదాయం...ఔషధం : మాదినేని సునీత, 5వ వార్డు కౌన్సిలర్ వైరా



మైదాకు చేతులకు పెట్టుకోవడం సంప్రదాయంతో పాటు మంచి ఔషధం. ఇది పూర్వం నుంచి వస్తున్న ఆచారం. నేడు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోన్లు వచ్చాయి. కోన్లను వాడాల్సి వస్తుంది. మంచి కంపెనీలకు చెందిన గోరింటాకు కోన్లలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్లు ఉండవు. శుభకార్యాలకు మహిళలు తప్పక మైదాకు పెట్టుకుంటున్నారు అని వైరా మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత అన్నారు.

## ఆదివాసీల సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యం

**- చర్ల ఏజెన్సీలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పి**
**- సిఆర్‌పిఎఫ్ క్యాంపుల సందర్శన**



**ప్రజాపక్షం/భద్రాచలం** ః మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివశించే ఆదివాసీ ప్రజల సంక్షేమమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. ఏజెన్సీలోని చర్ల మండల పరిధిలో గల చెన్నాపురం, ఎర్రంపాడు, బత్తినపల్లి, బట్టిగూడెం గ్రామాల ఆదివాసీ ప్రజలకు పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పి రోహిత్ రాజ్ ప్రారంభించారు. చెన్నాపురం గ్రామంలో ఎర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దకు బెత్తనపల్లి, ఎర్రంపాడు, బట్టిగూడెం గ్రామస్తులను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. సుమారు 150 కుటుంబాల వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లోని ఆదివాసీ ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున చుట్టుప్రక్కల చుట్టుప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చెన్నాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఎస్పి ముచ్చటించారు. నిషేదిత మావోయిస్టు పార్టీ తమ మనుగడ కోసం ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అతి త్వరలో చెన్నాపురం, పూసుగుప్ప గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పుతామని చెప్పారు. నిషేదిత మావోయిస్టు పార్టీకి ఎవ్వరూ సహకరించవద్దని, వారి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి అంకిత్‌కుమార్ సంక్వర్, చర్ల సిఐ రాజువర్మ, ఎస్ఐలు నర్సిరెడ్డి, వివిఎస్ రావు, వైద్యులు సాయివర్ధన్, విజయరావు, లోకేష్, శ్రీకాంతి తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ క్యాంపుల సందర్శన తెలంగాణ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దున ఉన్న ఉంజుపల్లి, పూసుగుప్పలోని సిఆర్‌పిఎఫ్ క్యాంపులను ఎస్పి రోహిత్ రాజ్ సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మావోయిస్టు కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ రెండు క్యాంపుల్లో జరుగుతున్న కొన్ని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అధికారులు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## తె.అ.అ సంస్థ చైర్మన్‌గా నేడు పొదెం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/భద్రాచలం** ః తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా భద్రాచలం మాజీ ఎంఎల్‌ఎ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ వేడుక హైదరాబాద్‌లోని కొండాపూర్ బొటానికల్ గార్డన్‌లో వైభవంగా జరగనుంది. ఈ వేడుకకు పలువురు మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీలోని నమ్మకమైన నాయకునిగా ఉన్న వీరయ్య గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ వీరవిధియోనిగా, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి శిష్యునిగా గుర్తింపు ఉన్న వీరయ్యను కాంగ్రెస్ పార్టీ విస్మరించకుండా క్యాబినేట్ ర్యాంకు గల పదవిని కట్టబెట్టింది. నేడు ప్రమాణస్వీకరణ చేటడం పట్ల సర్వత్ర ఆనందం వ్యక్తమవుతోంది. ఇందు కోసం భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్ తరలాయి. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి భద్రాచలం గడ్డపై అడుగుపెట్టే క్రమంలో కూడా బహిరంగ సభ నిర్వహించేందుకు సమాలోచన చేస్తున్నారు. వీరయ్య కార్పోరేషన్ చైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపడుతున్న సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో మంచి ఊపందుకుంది.

# వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి





**ప్రజాపక్షం/సుజాతనగర్ :** వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్యసేవలందించాలని జాయింట్ సెక్రటరీ (ఐ ఎన్ ఎం) జి ఓ ఐ డాక్టర్ యోగితా రాణా, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లు అన్నారు. వారు మండలంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మండలంలోని ఎదుల వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి, నీటి పారుదల శాఖ అధికారులతో స్థానిక రైతులతో మాట్లాడారు. నాణ్యతతో నిర్మించాలని పనులను రైతులు అడిగి తెలుసుకోవాలని రైతుల కోసమే నిర్మించడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వేపలగడ్డ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించి, గర్భిణికి శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్యం పట్ల పలు సూచనలు చేశారు. అంగన్ వాడి కేంద్రంలో మొక్కలు నాటి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. అనంతరం సర్వారంలోని హెల్త్ సబ్ సెంటర్ లో రికార్డులు, రిజిస్టర్లను మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పల్లె దావఖాన బోర్డు లో ఉన్న మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందుల పేర్లు అందరికీ అర్థమయ్యేలా తెలుగులో రాసి బోర్డు ను బయట పెట్టాలని ఆదేశించారు. అందుబాటులో లేని మందుల పేర్లపై స్టికర్ వేయాలని తెలిపారు. ఆశా వర్కర్లు రోజు వారీ తమ విధులు అడిగి తెలుసుకున్నారు. ప్రతిదీ రికార్డు నమోదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆస్పిరేషన్ కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో విద్య, వైద్యం, నైపుణ్యం పై పనుల పర్యవేక్షణ కార్యక్రమంలో బాగంగా జిల్లా లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి విజేత, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డిప్యూటీ తహాశీల్దార్ కూచిపూడి నాగరాజు, మెడికల్ ఆఫీసర్ రమేష్, ఎంపీఓ ఖాన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి సుధతి, పంచాయతీ కార్యదర్శులు బి నరేంద్ర ప్రసాద్, సతీష్ కుమార్, అంగన్‌వాడి టీచర్స్ , ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కోతులు, కుక్కలతో భయం.. భయం..



**నియంత్రణ చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు వేడుకోలు.**





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో కోతులు, కుక్కల దాడులతో కల్లూరు పట్టణం మరియు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతి నెల సుమారుగా 50 కి పైగా గ్రామీణ పట్టణ ప్రజలను కుక్కలు, కోతులు గాయ పరుస్తూ బ్రాంతులకు గురూ చేస్తుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి కొరకు నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను, ప్రజాప్రతినిధులను, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. వీటి నియంత్రణకు ప్రత్యేక మార్గాలను, ప్రత్యేక ప్రణాళికలను చేపట్టి చర్యలు తీసుకోవాలని మొరపెట్టుకుంటున్నారు. వీటిపై వీటి నివారణకు ప్రత్యేకమైన ప్రణాళికలను చేపట్టి, నివారణ మార్గాలను అన్వేషించి కోతులు, కుక్కలు బెడదల నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కల్లూరు, చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ప్రతి నెల కనీసం వంద మందిని గాయపరుస్తూ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. అయినా వీటిపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. కల్లూరు లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు కోతులు, కుక్కలు బెడదల నుండి రక్షణ కొరకు ముందు గేట్లు మూసివేసి ఉద్యోగులు సిబ్బందివిధులు నిర్వహిస్తున్నారు. కల్లూరు లోని ఎన్ఎస్పి కార్యాలయాలు ,మార్కెట్ కమిటీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, పంచాయతీ రాజ్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం తదితర కార్యాలయాలలో విధులు నిర్వహించాలంటే ధైర్యం వహించాల్సిందే. కుక్కల, కోతులు భారీ నుంచి రక్షణకు చర్యలు చేపట్టాలని కల్లూరు మండల ప్రజలు కోరుతున్నారు.

# ఇంజనీర్స్‌గా సేవలందించడం మా అదృష్టం



**ప్రజాపక్షం/కల్లూరుః** ఇంజనీర్స్ గా సేవలందించడం మా అదృష్టం అని కల్లూరు లోని పంచాయతీరాజ్, ఎన్ఎస్పి సర్కిల్ కార్యాలయం ఈఈ కార్యాలయం లలో ఇంజనీర్స్ దినోత్సవమును ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు మాట్లాడుతూ ఇంజనీర్లుగా ప్రజలకు సేవలందించడం మాకు ఎంతో అదృష్టమని ఇంజనీర్లుగా గ్రామాలలో పట్టణాలలో భవనాలు వంతెనలు రహదారులు నిర్మించి ప్రజలలో చిరకాలంగా నిలిచే అదృష్టం కలిగిందని పేర్కొన్నారు. మానవ దేహంలో ధమనులు, సిరలు రక్తాన్ని సరఫరా చేస్తూ మనిషిని ఆరోగ్యంగా ఉంచడానికి ఎట్లా దోహదం చేస్తున్నాయో అదేవిధంగా దేశంలో రహదారులు వ్యవస్థ అంతా చక్కగా విస్తృతంగా ఉంటే అంత ఎక్కువగా ప్రగతి ఫలాలు దేశంలోని ప్రజలందరికీ అందుతాయని ఆధునిక యుగంలో రహదారులు నిర్మాణానికి మనం హెచ్చించే ఖర్చు మానవులకు ఉపయోగకారిగా ఉండాలని, ఇంజనీరు ఎంతో చాకచక్యంగా పని చేస్తూ నిర్మించి ప్రజలకు అంకితం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయాలలో సిబ్బంది, అధికారులు మిఠాయి పంపకం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కార్యాలయం లో అధికారులు నరసింహారావు, నవీన్, శ్రీనివాసరావులతోపాటు ఈ ఈ కార్యాలయంలో ఈ ఈ లక్ష్మీ నారాయణ, రాజా రత్నాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ కార్యాలయంలో డి ఈ రాంబాబు , సాంబశివరావు సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ప్రమాణాస్వీకారంకు తరలివెళ్లిన శ్రేణులు



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా రాయల నాగేశ్వరరావు గురువారం రాజదానిలో తన చాంబర్ లో ప్రమాణాస్వీకారం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కు మండలం లోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఎంపీటీసీలు దోసపాటి కల్పన, రేగూరి వాసవి, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, జెర్రిపోతుల సత్యనారాయణ, బోయిన వేణు, పగిడికత్తుల సుదర్శన్, జర్నలిస్టు సంఘం నాయకులు పోలంపల్లి నాగేశ్వరరావు, ఎస్.నరసింహారావు, గంజికుంట్ల వెంకన్న, మల్లేబోయిన ఉపేందర్, తాతా హనుమంతరావు, యం.నాగరాజు, అరుణ్, వి.వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# నాగులవంచలో వనమహోత్సవం

**ప్రజాపక్షం-చింతకాని :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాగులవంచ ప్రభుత్వజూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కల పెంపకం వల్ల కలుగు ప్రయోజనాలు ఇంచార్జి ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి వివరించారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఇంజం క్రిష్ణార్జునరావు,అధ్యాపకులు రాంబాబు,మల్లయ్య,శ్రీనివాసరావు,నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి మండల వెంకన్న, వాణిల మనువడు కుమార్తె భూమిక, శ్రీకృష్ణ దంపతుల ముద్దుల కుమారుడు యువన్స్ 21వ ఫంక్షన్‌కు జిల్లా కాంగ్రేస్ కిసాన్ జనరల్ సెక్రటరీ దాసరి ఐలయ్య, మాజీ ఎంపిటిసి గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ కొమ్ము వెంకన్న హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల వెంకట్, బోడా రవి, లకావత్ రత్న, కొమ్ము ఐలయ్య, రెడ్డబోయిన వెంకన్న ,పచ్చిపాల వెంకన్న, ఉడుగుల వెంకన్న, మామిడిశెట్టి రమేష్, పచ్చిపాల సైదులు, పచ్చిపాల అవోక్ తదితరులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రధాన కాల్వ వైరా రిజర్వాయర్‌కు డైరెక్ట్‌గా అనుసంధానం చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు మళ్లించేందుకు సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ తిమ్మారావుపేట రాజ లింగాల మధ్యలో వైరా రిజర్వాయర్‌కు వచ్చే ఏరుకు డైరెక్ట్‌గా అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా రిజర్వాయర్ నిర్మాణ రూపశిల్పి మీర్ అలి నవాజ్ జంగ్ బహదూర్ 147వ జయంతి, తెలంగాణ రాష్ట్ర ఇంజనీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. మీర్ అలి నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ నైజాం ప్రభుత్వ ప్రధాన ఇంజనీర్‌గా నాటి కరువు పరిస్థితుల్లో తక్కువ ఖర్చు శతాబ్దాల తరబడి నిలిచే విధంగా రిజర్వాయర్‌ను నిర్మాణం చేసిన గొప్ప దార్శనికుడు నవాజ్ జంగ్ బహదూర్ అని అన్నారు. నిజాం సాగర్, వైరా, పాలేరు రిజర్వాయర్‌లతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం లాంటి విద్యా సంస్థలు ప్రజల ప్రయోజనాల కోసం నిర్మాణం చేసి హైదరాబాద్ సంస్థాన అభివృద్ధిలో ముఖ్య భాగస్వామ్యం వహించి చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచారని అన్నారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టు ప్రమాదంలో ఉందని గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌కు మరలించేందుకు సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ తిమ్మారావుపేట రాజలింగాల సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ అక్కడ ఏరుకి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు, సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బెజవాడ వీరభద్రం, మాడపాటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.







# పూర్వ విఆర్‌వోల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వినతి



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్రంలోని విఆర్‌వోల సమస్యల సాధనకు తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారులు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాల్లో భాగంగా మొత్తం మూడంచెల కార్యచరణతో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని అందరూ కలెక్టర్లను కలిసి మెమొంరాండాలు సమర్పించి పూర్వ విఆర్‌వోలను రెవిన్యూ శాఖలకు తిరిగి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. రెండో దశలో మంత్రులతో సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 మంది శాసనసభ్యులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. విఆర్‌వోలను తిరిగిరెవెన్యూ శాఖలో తీసుకొని సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి, రెవెన్యూ శాఖ మంత్రికి సిఫారస్ చేయాల్సిందిగా విజ్ఞాపన పత్రాలు అందిస్తున్నామని అన్నారు. ఇక కీలకమైన మూడో దశలో మొత్తం 5000 మంది విఆర్‌వోలతో రాష్ట్రవ్యాప్త మహాసభ నిర్వహించడం కోసం మూడంచెల ప్రణాళిక రూపొందించామన్నారు. ఇప్పటికే మొదటి రెండు దశలు పూర్తి చేసుకున్నామని, రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు, కలెక్టర్లకు మా బాధలు వివరించుకున్నామని, రాష్ట్ర అధ్యక్షలు గరికె ఉపేంద్రరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదులు, షేక్ బాషాసాహెబ్, జి.అశోక్, పి.నర్సింహారావు, షేక్ లాల్ మియా, పి.నాగేశ్వరరావు, బాలమురళి, వెంకటేశ్వర్లు, అనిత, శ్రీలక్ష్మి, పద్మ, రవికుమార్, అనిల్, భూపతి తదితరులు పాల్గొన్నారు.



















